# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

*(గత సంచిక తరువాయి)*

11

**"సుమని చూసి** అప్పుడే ఐదు రోజులయింది. నన్ను చూసి భలే నవ్వుతుంది అది" అన్నది వీణ.

వేణు "ప్రతిరోజూ రేఖతోనూ, రాజేశ్వరితోనూ మాట్లాడుతూనే వున్నావు కదా" అన్నాడు.

"అవును. వాళ్ళ యోగక్షేమాలు కనుక్కుంటూ వున్నాను. కానీ నా మనసు ఆ పసిదాని మీదకు పోతున్నది. ఒకసారి వెళ్ళొద్దాము" అన్నది వీణ.

"సరే, రేపో ఎల్లుండో వెడదాం" అని వేణు అంటుండగానే, ఫోన్ మ్రోగింది.

"వేణూ, నేను ప్రకాషుని. నేనిక్కడ కొంత డబ్బు మిత్రులు ఇస్తే తీసుకున్నాను. పెద్ద మొత్తమేమీ కాదు కానీ, ఎంతో కొంత. రేఖకి ఉపయోగపడుతుంది. వాళ్ళు ఇచ్చిన చెక్కులు తీసుకువస్తున్నాను. అంతా రేఖకి ఇచ్చేస్తాను. ఈలోగా ఇంకొక గుడ్ న్యూస్. ఇక్కడ అర్జున్ అని మన ఫ్రెండ్ గుర్తున్నాడా? అతనూ, వాళ్ళావిడా ఇద్దరూ వాళ్ళ ఉద్యోగాల్నించీ రిటైర్ అయాక, 'ఇప్పుడు మేము ఎక్కువగా ఎక్కడికీ వెళ్ళటం లేదు. వెళ్ళినా ఇద్దరం కలిసి ఒకే కారులో వెడుతున్నాం. మాకొక కారు చాలు. రెండో కారు బాగా నడుస్తుందిగానీ పాత కారు. రేఖ వాడుకుంటానంటే మనిద్దరం వెళ్ళి ఆమెకి ఇచ్చి వద్దాం' అన్నాడు. నేను రేఖతో మాట్లాడాను. లాయర్ ఆమె కారు కూడా వాళ్ళు తిరిగి ఇచ్చేటట్టు ప్రయత్నం చేస్తానన్నాడుట, అప్పటిదాకా వాడుకుని, తరువాత తిరిగి ఇచ్చేస్తాను అన్నది. ఈ శనివారం వస్తామని చెబితే సరేనన్నది. మీ ఇంటికి వచ్చి, అక్కడినించీ అందరం రేఖ ఎపార్ట్మెంటుకి వెడదాం. ఈ విషయం చెబుదామనే పిలిచాను" అన్నాడు ప్రకాష్.

“సరే. ఇప్పుడే వీణ అంటున్నది మనం కూడా వాళ్ళింటికి వెడదామని. ఇక్కడికే వచ్చేయండి. అందరం కలిసే వెడదాం” అన్నాడు వేణు ఫోన్ పెట్టేస్తూ.

మళ్ళీ మ్రోగింది ఫోన్.

“అంకుల్. నేను రేఖని” అన్నది.

“అంతా బాగున్నారా అమ్మా” అడిగాడు వేణు.

“బాగానే వున్నాం అంకుల్. ఒక గుడ్ న్యూస్ చెబుదామని పిలిచాను” అన్నది.

“చెప్పు, ఏమిటా గుడ్ న్యూస్” అడిగాడు వేణు.

“ఇప్పుడే లాయర్ కార్సన్ పిలిచాడు. ప్రొటెక్టివ్ ఆర్డర్ ఇచ్చిందిట కోర్టు. వాసు, అతని కజిన్, అమ్మా, నాన్నా ఎవరూ నాకుగానీ, నాకుటుంబానికిగానీ ఇరవై మైళ్ళ దూరంలోకి రాకూడదనీ, వస్తే అరెస్ట్ చేయవలసి వస్తుందనీ కోర్టు చెప్పిందిట. వాళ్ళకి నోటీసు ఇచ్చారు. నాకూ కాపీ పంపిస్తున్నారుట” అన్నది ఆనందంగా.

“వావ్! అవును నిజంగా మంచి రిలీఫ్. ఇది మనకి మొదటి విజయం” అన్నాడు వేణు.

“ఇండియాలో నాన్నని కూడా ఇప్పుడే నిద్రలేపి మరీ చెప్పాను. హి ఈజ్ హాపీ” అంది నవ్వుతూ.

“బాగుంది. ప్రకాష్ మాట్లాడాడా?” అడిగాడు.

“అవును అంకుల్. కారు తీసుకుని వస్తారుట శనివారం. నన్నడిగితే చెప్పాను, నాకు కారు వచ్చేదాక అర్జున్ గారి కారు వాడుకుని, తర్వాత ఇచ్చేస్తానని. అర్జున్ గారు చాల మంచివారులాగా వున్నారు”

“అవును, ఆయన నాకు కూడా ఎన్నో ఏళ్ళుగా బాగా తెలిసిన ఎంతో మంచి మిత్రుడు” అన్నాడు వేణు.

తర్వాత వీణకి కూడా ఆ మంచి వార్త చెప్పింది రేఖ.

“బాగుంది నాన్నా. వెరీ గుడ్ న్యూస్. మరి ఈ శుభవార్త సుమకి చెప్పావా?” అని అడిగింది వీణ చిరునవ్వుతో.

నవ్వింది రేఖ.

“చెప్పకపోతే ఎలా? మీ అందరికన్నా ముందే దానికి చెప్పాను. ఒక అందమైన నవ్వు ఇచ్చేసింది” అన్నది రేఖ మళ్ళీ నవ్వుతూ.

## 12

మర్నాడు ప్రకాష్, ప్రసూన ఒక కారులోనూ, అర్జున్ ఇంకొక కారులోనూ వచ్చారు.

చాల రోజుల తర్వాత కలవటం వల్లా, రేఖ కబుర్ల వల్లా సమయం ఇట్టే గడిచిపోయింది.

భోజనాలు చేసేటప్పుడు ప్రకాష్ వేణుని చూస్తూ అడిగాడు “రేఖ గురించి నీ అభిప్రాయం ఏమిటి” అని.

ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు వేణు “చిన్న వయసులోనే జీవితంలో పెద్ద దెబ్బ తిన్నది. అయినా రేఖ చాల తెలివైనది. త్వరగా మంచీ చెడూ ఆలోచించి చక్కటి నిర్ణయాలు తీసుకునే స్వభావం ఆమెది. మంచి ధైర్యం కూడా వుందామెలో. మనుష్యుల్ని ఇట్టే చదివేసే శక్తి వుంది. అవన్నీ వుండటం వల్లే, పదిరోజుల పసికందుతో ధైర్యంగా ఇంట్లో నించీ బయటికొచ్చేసింది. ఆమె మిగతా పనులు కూడా ఎంత నిబద్ధతతో చేస్తున్నదో చూశాక, నాకు ‘రేఖకి బాగా జీవించటం తెలుసు, దాని కోసం ఏమైనా చేయగలదు. సాధించగలదు’ అనే ధైర్యం వచ్చింది. మనం చేసేది సహాయం మాత్రమే. ఇక తన జీవితానికి తనే సారథి. కోర్టు గొడవలన్నీ అయిపోయిన తర్వాత, ఆమె జీవితం సుఖవంతంగా వుంటుందని నా ఆశ. గట్టి నమ్మకం”.

“అవును. నాకూ అదే అనిపించింది. కష్టాలు ప్రతివారికీ వస్తూనే వుంటాయి. అవి చూసి బాధపడటం బదులు, వాటిలోనించీ బయటపడే తెలివితేటలు, ధైర్యం వుంటే మళ్ళీ జీవితం సుఖమయం చేసుకోవచ్చు అనే దానికి రేఖ ఒక పెద్ద ఉదాహరణ” అన్నది వీణ.

“బాగుంది. ఈరోజుల్లో మనలో, ముఖ్యంగా మన ఆడవారిలో అది చాల అవసరం” అన్నాడు అర్జున్.

అందరూ కలిసి రేఖ ఎపార్ట్మెంటుకి వెళ్ళారు.

అక్కడ తలుపు బయట ఒక పెద్ద అట్టపెట్టె వుంది.

వేణు కొట్టిన కాలింగ్ బెల్ శబ్దం విని, తలుపు తీసి బయటకు వచ్చింది.

అందరికీ నమస్కారం చెప్పింది. "ఇదేమిటి ఈ పెట్టె?” అన్నది.

“చెబుతాను” అని వేణు అట్టపెట్టెని త్రోసుకుంటూ లోపలికి వచ్చాడు.

“ఫీనిక్సులో వుండే మా అమ్మాయి సరళకి రేఖ గురించి వీణ అన్నీ చెబుతూనే వుంది. నాలుగు రోజుల క్రితం తను సుమకి ఒక ఉయ్యాల మంచం పంపిస్తాను, అడ్రస్ ఇవ్వమంది. ఇచ్చాను. అదే ఇది” అన్నాడు వేణు.

“అయ్యో, నేను కొనుక్కునే దాన్నికదా అంకుల్” అంది రేఖ కొంచెం నొచ్చుకుంటూ.

“సరళ ఇద్దామనుకున్నది. నీకు అది అవసరం. మరి ఇక సమస్య ఏముంది? తీసుకో రేఖా” అంది వీణ.

అందరూ ముందు గదిలో మాట్లాడుకుంటుంటే, రాజేశ్వరి వంటింట్లో పకోడీలు చేస్తున్నది. అవి చేస్తూనే తన పక్కనే నుంచున్న ప్రసూనతో, వాళ్ళ చిన్నప్పటి కబుర్లతో పాటు, రేఖ విషయంలో జరిగిన కథంతా విపులంగా చెబుతున్నది.

ప్రసూన అన్నది, “రాజీ, ఇలాటి కథలు కొన్ని విన్నానుగానీ, ఇది మనవాళ్ళల్లోనే జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు. కానీ రేఖకి తెలుసు ఏది తనకి మంచిదో, అది ఎలా సాధించాలో” అని.

వేణూ, అర్జున్ మాట్లాడుతూనే ఉయ్యాలని అట్టపెట్టెలోనించీ తీసి బిగిస్తున్నారు.

ప్రకాష్ జేబులోనించీ ఒక కవర్ తీసి “నాకు దగ్గర మిత్రులు కొంతమంది ఇది నీకు ఇవ్వమన్నారు’ అంటూ అది రేఖకి ఇచ్చాడు.

“ఇదేమిటి” అంటూ అది తీసుకున్న రేఖ, విప్పి చూసి “మళ్ళీ డబ్బులా.. ఎందుకు మీరు నిన్న నా బాంకుకి పంపించారుగా” అంది.

ప్రకాష్ నవ్వి, “అది నాది, ఇది నా మిత్రులది. నీకే కాదు, ఇలాటి సందర్భాల్లో ఎవరికైనా అవసరమే. లాయర్ ఖర్చులు, పాపాయికి అదనపు ఖర్చులూ, మిగతా ఖర్చులూ... డబ్బు ఎంతో అవసరమయే సమయం ఇది. సహృదయంతో ఇచ్చినప్పుడు వద్దు అనకూడదు” అన్నాడు.

రేఖ మాట్లాడలేదు.

పక్కకి తిరిగి బయటికి వస్తున్న కన్నీటి బిందువులను తుడుచుకున్నది.

“ఈ అసెంబ్లీ చాల సులభమే” అన్నాడు అర్జున్ ఉయ్యాలలో చివరి బోల్టు కూడా బిగించేసి.

“రేఖా, ఉయ్యాల రెడీ. నీ బెడ్రూంలోకి తీసుకు వెళ్ళమంటావా?” అడిగాడు వేణు.

తలవూపింది రేఖ.

కొత్త ఉయ్యాలలో దుప్పట్లు వేసి, సుమని పడుకోబెట్టింది రేఖ.

రాజేశ్వరి అందరికీ పకోడీలు పెట్టి కాఫీ ఇచ్చింది.

అదయాక  అర్జున్ రేఖకి కారు తాళాలిచ్చాడు.

“ఇన్స్యూరెన్స్, రిజిస్ట్రేషన్ కాగితాలు అన్నీ ఇవిగో. కారు నా పేరుతోనే వుందిగానీ, నువ్వు ఎన్నాళ్ళు కావాలంటే అన్నాళ్ళు వాడుకో” అన్నాడు.

“థేంక్స్ అంకుల్” అంది రేఖ.

“క్రిందికి వెళ్ళాక కారు చూపిస్తాను. కారు లోపల బయటా శుభ్రంగా క్లీన్ చేయించింది మా ఆవిడ”

“మరి ఆంటీ రాలేదే?” అని అడిగింది రేఖ.

“ఇవాళ మా ఇళ్ళ దగ్గర ఆల్ లేడీస్ గెట్టుగెదర్ వుందిట. ఆవిడకి అదే ముఖ్యం. అందుకని రాలేదు” అన్నాడు అర్జున్ నవ్వుతూ.

“ఇక వెడతాం. ఆల్ ది బెస్ట్” అన్నాడు ప్రకాష్.

క్రిందికి వచ్చాక, కారు చూపించాడు అర్జున్.

రేఖ లోపలా బయటా చూసి, “కొత్త కారులా వుంది అంకుల్. బాగా మైంటైన్ చేశారు” అంది.

“రిటైర్ అయాక ఎక్కువ మైళ్ళు నడపలేదు. అందుకే అలా వుంది. నాకు తెలిసి ఏ రిపైర్లూ అవసరం లేదు” అన్నాడు అర్జున్.

‘సరే ఇక మేము వెడతాం, లాంగ్ డ్రైవ్ వుంది కదా” అన్నాడు.

“రాత్రికి ఇక్కడ పడుకుని రేపు వెళ్ళరాదూ” అన్నది వీణ.

“లేదు వీణా, రేపు ప్రొద్దున్నే అవసరమైన కొన్ని పనులున్నాయి. రాత్రికే వెళ్ళాలిలే. ఇంకోసారి వస్తాంలే” అన్నాడు ప్రకాష్.

రేఖ పేరుపేరునా ప్రకాష్, అర్జున్, ప్రసూనలకు ధన్యవాదాలు చెప్పింది.

ప్రకాష్, ప్రసూన, అర్జున్ కారులో లాసేంజలెస్ వెళ్ళటానికి బయల్దేరారు.

వాళ్ళు వెళ్ళన తర్వాత, వేణు వీణ కూడా బయల్దేరుతుంటే లీసా వచ్చింది. ఆమెతోపాటు పక్కనే ఇంకొక అమ్మాయి కూడా వుంది.

రేఖ అందరికీ లీసాని పరిచయం చేసింది.

లీసా తన పక్కనే సన్నగా, అందంగా వున్న అమ్మాయిని పరిచయం చేస్తూ, “ఇది డెబ్బీ. ఇక్కడ నేనూ డెబ్బీ రూమ్మేట్సుమి. కొంచెం అవతలగా వుంది మా ఎపార్ట్మెంట్. అచ్చం రేఖ తీసుకున్న ఎపార్ట్మెంట్ ప్లానే. డెబ్బీ ఒక మెడికల్ గ్రూపులో ఇన్స్యూరెన్సులూ అవీ చూస్తుంటుంది. ఈమధ్యనే ఒక కౌన్సెలింగ్ కంపెనీలో కొత్త వుద్యోగంలో చేరింది” అన్నది.

“అవును. నేను నిన్న కలిశాను. ఇద్దరం మంచి స్నేహితులం అయిపోయాం కూడాను. అందరూ పైకి రాకూడదూ, కాసేపు కబుర్లు చెప్పుకుందాం. అంకుల్, మీరూ రండి. వచ్చినప్పటి నించీ విశ్రాంతి లేకుండా ఉయ్యాల బిగిస్తున్నారు” అంది రేఖ.

“లేదు రేఖా, మేము వెళ్ళాలి, ఏవో చిల్లర పనులు చాల వున్నాయి” అన్నది వీణ.

“అవును. వెళ్ళాలి. మళ్ళీ తర్వాత పిలుస్తాను. మాట్లాడదాం” అన్నాడు వేణు.

వాళ్ళ కారు వెళ్ళిపోయాక, “సరే, పద. రేఖా. పైకి వెడదాం. సుమ బంగారాన్ని చూడాలి” అన్నది లీసా.

## 13

లండన్లో నాలుగు రోజులు ఇట్టే గడిపేశాడు నిక్.

పగలు జెస్సికా, బాబ్ ఉద్యోగాలకి వెళ్ళగానే తనూ వూరి మీద పడేవాడు. చూద్దామనుకున్నవన్నీ చూసి సాయంత్రం, వాళ్ళు ఇంటికి వచ్చే సమయానికి ముందే వచ్చేవాడు. తర్వాత ముగ్గురికీ ఫామిలీ టైమ్.

కుటుంబ విషయాలు, స్నేహితుల కబుర్లు, ఇంగ్లాండులో తను చూసిన ప్రదేశాలు, ఇలా రకరకాల విషయాల మీద మాట్లాడుకునే వాళ్ళు.

ఒకరోజు సంభాషణలో సమీర ప్రసక్తి వచ్చింది.

జెస్సికా కావాలనే ఆ టాపిక్ తీసుకువచ్చింది.

"సమీర మీద నీ అభిప్రాయం ఏమిటి?" అని సూటిగానే అడిగింది.

నవ్వుతూ అన్నాడు నిక్. "నా అభిప్రాయం నీకు అవసరమా? నేను ఆమెని చూసింది రెండు వారాలకు తక్కువగానే. సమీర ఎన్నోఏళ్ల స్నేహితురాలిగా నాకన్నా నీకే ఎక్కువగా తెలుసు"

జెస్సీ కూడా నవ్వుతూ అంది, "నేను అడిగింది నీ అభిప్రాయం. నా అభిప్రాయం కాదు"

"దటీజ్ ఎ గుడ్ పాయింట్" అన్నాడు బాబ్.

"నాకు ఒకళ్ళ గురించి మాట్లాడటం, ముఖ్యంగా వాళ్ళు ఎదురుగా లేనప్పుడు ఇష్టం వుండదు. అయినా మీరు అడిగారు కనుక చెబుతున్నాను. ఆమెది చాలా కాంప్లెక్స్ పర్సనాలిటీ. అర్థం చేసుకోవటం కష్టం. ఎందుకంటే ఆమె వెరీ అన్ ప్రెడిక్టబుల్. ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తుందో చెప్పటం కష్టం" అన్నాడు నిక్.

"అవును" అని తన చిన్ననాటి కబుర్ల దగ్గర నించీ మొదలుపెట్టి, సమీర గురించి అన్నీ చెప్పింది జెస్సీ.

"నువ్వు రెండు, మూడుసార్లు చెప్పావుగానీ నేను అంతగా పట్టించుకోలేదు. ఆమెలో మంచి ప్రేమ వుంది. దానితోపాటే కొంత చిన్న పిల్ల మనస్థత్వం కూడా వుంది. ఇద్దరం ఒకే చోట వున్నది రెండు వారాల పైనే అయినా, ఇద్దరం కలిసి తిరిగింది మాత్రం ఐదారు రోజులే. ఆమెలో నేనా కొద్ది సమయంలో చూసిన దాన్ని బట్టి నా ఆలోచనలు చెబుతాను. కానీ జెస్సికా, నేను చెప్పేదేదీ నువ్వు సమీరతోగానీ, ఇంకా ఎవరితోనైనాగానీ చెప్పను అని నాకు మాట ఇస్తేనే చెబుతాను" అన్నాడు నిక్.

"ఓకే. మాట ఇస్తున్నాను. సమీరకే కాదు, ఇంకా ఎవరికీ కూడా చెప్పను" అంది జెస్సికా.

నిక్ ఒకసారి గొంతు సవరించుకుని అన్నాడు,

"నాకు ఏమనిపించిందంటే ఆమెలో కోగ్నెటివ్ డిసొనెన్స్ వుందేమోనని. అదేమిటని అడుగుతావని నాకు తెలుసు. అందుకే అదీ చెబుతాను విను. మన ప్రవర్తన, నమ్మకాలు ఒకే త్రాటి మీద నడవనప్పుడు ఆ కోగ్నెటివ్ డిసొనెన్స్ ఛాయలు కనపడతాయి. అదేకాక ఒక వ్యక్తి భావాలు, ఒకే విషయంలో ఒకదానితో ఇంకొకటి విరుద్ధంగా వున్నప్పుడు కూడా అంతే. అలా భావ వైరుద్ధ్యం, వారి ఆలోచనా వైరుద్ధ్యం వున్నప్పుడు మనసు ఉద్రేకపడటం సహజంగా జరుగుతుంది. మనసులోని ఆ బాధ రకరకాలుగా బయటకి వస్తుంది. అసలు విషయం వదిలేసి మాట తప్పించి మాట్లాడటం ఒకటి. ఎదురుగా వున్న నిజాలని పట్టించుకోకుండా సత్యదూరమైన సమాచారాన్ని, తన మనసులో తనే కల్పించుకున్న ఊహాలోకంలోకి తీసుకువెళ్ళే అవకాశం వుంది, అందువల్ల ఎదుటి వారిని అనుమానించటం కూడా జరుగుతుంది"

జెస్సికా ఆలోచనలో పడింది.

"అంతేకాదు అటువంటి సమయాల్లో వారు చేసే పనులూ, ఫేక్ నమ్మకాలూ తమలోనే దాచుకోవటానికి ప్రయత్నం చేస్తారు. ఎంత స్నేహితులనైనా ఇతరులని దూరంగా వుంచుతారు. వారి భావాలకు విరుద్ధంగా వుండే ఏ సమాచారాన్నైనా సరే తీసుకోరు" అన్నాడు నిక్.

సాలోచనగా అన్నది జెస్సికా, "అవును, నువ్వు చెబుతుంటే సమీర ప్రవర్తనతో పోల్చి చూస్తున్నాను. నీ ఎనాలిసిస్ నిజమేననిపిస్తున్నది"

"ఇది పెద్ద ఎనాలిసిస్ ఏమీ కాదు. నా మొదటి ఆలోచన మాత్రమే ఇది. మే బి, ఐ యామ్ రాంగ్. నా ఆలోచన తప్పయితే నాకూ సంతోషమే" నిక్ అన్నాడు.

బాబ్ అడిగాడు, "ఒకవేళ నీ ఆలోచన సరైనదే అనుకుందాం. అప్పుడు ఈ సమస్యని పరిష్కరించటం ఎలా?" అని.

చిన్నగా నవ్వుతూ అన్నాడు నిక్. "అందుకేగా నాలాటి సైకాలజీ కౌన్సిలర్లూ, థెరపిస్టులూ వున్నది"

"సమీర కూడా అమెరికాకి వచ్చేశాక నువ్వే ఆ పని చేయవచ్చు కదా!" అన్నాడు బాబ్.

పెద్దగా నవ్వాడు, "నేను చికాగోనించీ రెండు వేల మైళ్ళ దూరంలో వుంటాను. అదీగాక చికాగోలో నాకన్నా కూడా ఎంతో అనుభవం వున్నవాళ్ళు ఎంతో మంది వున్నారు. అదో సమస్య కానే కాదు. సమీర బాగా తెలివైన అమ్మాయి. విషయం వివరంగా చెబితే అర్ధం చేసుకోగలుగుతుంది అని నా అభిప్రాయం. దీనికి మూల కారణం చూపించి, దానిని ఎలా స్వాధీనంలోకి తెచ్చుకోవాలో చెబితే తనే సాధించగలదు అని నా నమ్మకం" అన్నాడు నిక్.

"సమీర ఆ సైకాలజిస్టుల మాట వినవద్దూ! అలా వింటే ఈ సమస్యకు సగం పరిష్కారం అయినట్టే కదా" అంది జెస్సికా.

"మన మనసుని మన స్వాధీనంలో పెట్టుకుంటే ఏదైనా సాధించవచ్చు. దాని కళ్ళాలు విప్పేసి వదిలేస్తే, కల్లు త్రాగిన కోతిలా గంతులు వేస్తుంది. ప్రపంచానికి ఇండియా ఇచ్చిన వాటిలో ముఖ్యమైనది మెడిటేషన్. మనసుని మన ఆధీనంలో పెట్టుకోవటానికి అదెంతో ఉపయోగపడుతుంది. నా సత్యాన్వేషణలో ప్రాధాన్యత దానికే ఎక్కువ ఇచ్చాను" అన్నాడు నిక్.

బాబ్ సాలోచనగా తలుపూపాడు.

నిక్ ప్రయాణం రేపనగా ఆరోజు రాత్రి జెస్సికాకి ఫోన్ చేసింది సమీర.

జెస్సికాతో చాలసేపు మాట్లాడింది సమీర.

"నిక్ రేపు అమెరికాకి వెళ్ళిపోతున్నాడా?" అని అడిగింది.

"అవును. సూట్కేసులు సర్దుకుంటున్నాడు" అంది జెస్సికా.

"ఒక్కసారి మాట్లాడనా?"

జెస్సికా "ఒక్కసారేమిటి. ఎన్నిసార్లు కావాలంటే అన్నిసార్లు మాట్లాడు. ఉండు. పిలుస్తాను" అని అతన్ని పిలిచింది.

"హలో, బాగున్నావా?" అని అడిగింది సమీర.

"బిజీ, బిజీ. రేపే కదా నా ప్రయాణం" అన్నాడు.

"అవును, తెలుసు. అందుకే పిలిచాను" అంది.

"ఎట్లా వుంది నీ రీసెర్చి పని" అడిగాడు నిక్.

"పెద్ద బిజీగా లేదుగానీ, బాగుంది. నీ సంగతి చెప్పు. కాలిఫోర్నియాలో శాన్ డియాగోలో ప్రాక్టిస్ పెడుతున్నాను అన్నావు కదా. మరి అంతా సిద్ధంగా వుందా?"

"ఆఫీసు పని మొదలయింది. మాకు బండి నడవాలంటే క్లయంట్లు కావాలి కదా.  వాళ్ళు అదే పని మీదున్నారు. నా కోసం ఎదురు చూస్తున్నారు. నేను వెళ్ళగానే మొదలుపెట్టేయటమే. నీకు వీలున్నప్పుడు ఫోన్ చేయి. కబుర్లు చెప్పుకుందాం. సాహిత్యం గురించీ నా సత్యాన్వేషణ గురించీ మాట్లాడనులే. నీకు బోరు కొడుతాయేమో అవి" అన్నాడు నిక్ నవ్వుతూ.

సమీర కూడా నవ్వి, "బోరు కాదు. వాటి మీదకి నా మనసెప్పుడూ పోలేదు. అంతే" అన్నది.

"మరి నేను సర్దుకోవాల్సినవి చాల వున్నాయి. నేను వెళ్ళనా" అడిగాడు నిక్.

"ఓ--- సారీ. అలాగే. నేను అనవసరంగా నీ టైమ్ వృధా చేస్తున్నాను" అన్నది సమీర.

"అదేం ఫరవాలేదు. అన్నీ సర్దేసుకుంటే, ఒక పని అయిపోతుందని" అన్నాడు నిక్.

"సరే. క్షేమంగా వెళ్ళు" అంది సమీర.

సమీర అతనితో ఎన్నో విషయాలు చెప్పాలని అనుకున్నదిగానీ, తీరా ఫోన్లో మాట్లాడబోతుంటే ఒక్క మాటా బయటికి రాలేదు.

అతనూ సర్దుకునే పనిలో బిజీగా వున్నాను అన్నాడు. ఒక్కడే వెడుతున్నప్పుడు సర్దుకోవాటానికి ఎంత సమయం కావాలి, ఎంతసేపు సర్దుకోవాలి? తనని తప్పించుకు తిరుగుతున్నాడా? మేబి.

తనకే అతని మీద పూర్తి నమ్మకం లేదు. ఇక అతనికి నా మీద ఏం నమ్మకం వుంటుంది.

అలాటి మనిషితో ముందుకు వెళ్ళటమా? అనుకుంది ఒక్క క్షణం.

అతను నిజంగా తనకి దగ్గరవాలనుకుంటుంటే, తనే ఆ అవకాశాన్ని వదిలేసుకుంటున్నదా అనుకుంది మరుక్షణం.

ం ం ం

సమీరకు అశోక్ ముఖోపాధ్యాయ్ కనపడి మూడు రోజులయింది. కాంటీన్లోగానీ, యూనివర్సిటీలో కానీ, కనీసం ఎపార్ట్మెంటు దగ్గరగానీ అతని ఛాయలు లేవు. ఏమైపోయాడు?

స్నేహితుడు వినీల్ ఘోష్ దగ్గరకి వెళ్ళాడా? ఇప్పుడు శెలవులేవీ లేవే!

బంగ్లాదేశ్ అమ్మాయితో కలిసి వినోదయాత్రలు చేస్తున్నాడా?

అమ్మాయిలతో ఎక్కువగా మాట్లాడటానికే బిడియపడతాడు, అలాటివి అతనేం చేయలేదు.

మరి, ఏమయివుంటుంది?

ఆరోజు సాయంత్రం యూనివర్సిటీనించీ ఇంటికి వస్తూ అతని ఎపార్టుమెంటు దగ్గర ఆగింది.

తలుపు కొట్టనా, వద్దా అని ఆలోచిస్తూనే తలుపు కొట్టింది. జవాబు లేదు.

ఈసారి ఇంకా గట్టిగా తలుపు కొట్టింది.

లోపల ఏవో శబ్దాలు అయాయి.

"ఎవరూ" అన్నాడు నీరసంగా అశోక్.

అన్నాడుగానీ తలుపు తీయలేదు.

"అశోక్. ఒంట్లో బాగాలేదా? ఏమయింది?" అని అడిగింది సమీర, తలుపు బయటే నిలుచుని.

"కొంచెం జ్వరంగా వుంది. దానితోపాటూ దగ్గు, జలుబూ, వొళ్ళు నొప్పులూ వున్నాయి. కరోనా కాదు అనిపించింది. అయినా టెస్ట్ చేయించుకుంటే నెగెటివ్ అన్నారు. కానీ నా అనుమానాలు నావి. ఇది ఒకవేళ కరోనా అయితే మీలాటి వారికి ఇవ్వటం భావ్యం కాదు కదా! అందుకే నేనే నన్ను సెల్ఫ్ ఐసొలేట్ చేసుకున్నాను. ఎవరితోనూ కలవదలుచుకోలేదు. మా ప్రొఫెసరుకి ఫోన్ చేసి చెప్పాను. టేక్ రెస్ట్ అన్నాడు. ఇవాళే కొంచెం బాగుందిగానీ మరీ నీరసంగా వుంది" అన్నాడు అశోక్.

"మరి మందులూ, తిండీ?" అడిగింది సమీర.

నీరసంగా నవ్వాడు అశోక్ "ఏవో టాబ్లెట్స్ వుంటే
వేసుకున్నాను. ఫ్రిడ్జిలో ఏవో వున్నాయి. వాటితో గడిచి పోతున్నది" అన్నాడు.

"గ్రోసరీ షాపులోనూ, రెస్టారెంటులోనూ మీకేం కావాలో చెబితే, కాసేపట్లో డిన్నరుకి వెళ్ళినప్పుడు తెస్తాను" అన్నది సమీర.

"మీకెందుకు శ్రమ. ఫరవాలేదులెండి" అశోక్ అన్నాడు.

సమీర నవ్వింది. "అటే వెడతానుగా. శ్రమేమీ లేదు. మీకేం కావాలో నాకు ఫోన్లో లిస్ట్ పంపించండి. తెచ్చి మీ తలుపు దగ్గర పెట్టి, తలుపు కొట్టి వెడతాను. సరేనా" అన్నది సమీర.

"అలాగే. తప్పకుండా. చాలా థాంక్స్" అన్నాడు అశోక్.

సమీర ఆరాత్రే అతనికి కావలసిన, బ్రెడ్, ఆరంజ్ జ్యూస్, కాఫీపొడి, పాలూ... ఇలా అతను అడిగినవీ, అడగనివీ అన్నీ తెచ్చి, తలుపు దగ్గర పెట్టి వెళ్ళింది.

అశోక్ ముఖర్జీ వెంటనే ఫోన్ చేసి మాట్లాడాడు. అనారోగ్యంగా వున్నప్పుడు అండగా నిలిచినందుకు ఎంతో ఋణపడి వుంటానన్నాడు.

అతనా మాటలు అంటున్నప్పుడు అతని గొంతు గాద్గదికమవటం గమనించింది సమీర.
తర్వాత రెండు రోజుల్లో పూర్తిగా కోలుకున్నాడు అశోక్.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments